నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 | కరీంనగర్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

## కరీంనగర్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు

విద్యానగర్, ఆగస్టు 31 : కరీంనగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మెడికల్ కళాశాలతో నర్సింగ్ కళాశాల ప్రారంభం కావాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ప్రభుత్వం నర్సింగ్ కళాశాలను మంజూరు చేయగా కొత్తపల్లిలో 36 ఎకరాల్లో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 నర్సింగ్ కళాశాలలను మంజూరు చేయగా, అందులో కరీంనగర్ ఒకటి. నర్సింగ్ కళాశాల ఏర్పాటు వల్ల ప్రభుత్వ వైద్యసేవలు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి. నర్సింగ్ కళాశాల మంజూరుపై వైద్యాధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి నర్సింగ్ అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి.

కరీంనగర్‌లోని 13డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

# కొత్తరేషన్ కార్డులకు కొలమానం ఏమిటీ?

రాష్ట్రంలోని కొత్త రేషన్ కార్డులపై అయోమయం కనిపిస్తున్నది. అర్హులకు కార్డులు ఇచ్చేందుకు ఈ నెల 17 నుంచి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఆహ్వానించదగ్గదే అయినా, అమలు తీరుతెన్నులపై మాత్రం స్పష్టత కొరవడింది. ఈ విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన వేసిన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటి వరకు నివేదిక ఇవ్వలేదు. ఇంకోవైపు ఈసారి రేషన్‌కార్డులు, ఆరోగ్య కార్డులు వేర్వేరుగా ఇస్తామని సర్కారు చెబుతున్నది. ఈ పరిస్థితుల్లో ఇప్పటివరకు ఉన్న రేషన్ కార్డులు (ఆహారభద్రత) కొనసాగుతాయా..? లేదా..? కొత్తగా ఉమ్మడి జిల్లాలో 65వేల పైచిలుకు మంది చేసిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటారా..? లేక మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా..? నెలల తరబడిగా ప్రజావాణికి వస్తున్న అర్జీలను ఎలా పరిష్కరిస్తారు? అన్నది తెలియడం లేదు. మరోవైపు మంత్రి వర్గ ఉపసంఘం సక్సేనా కమిటీ సిఫారసులను పరిగణలోకి తీసుకుంటామని చెబుతున్న నేపథ్యంలో ప్రజల్లో అనేక సందేహాలు తలెత్తుతుండగా.. ప్రభుత్వం మాత్రం అధికార యంత్రాంగానికి ఇప్పటివరకు ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు.




- ఈ నెల 17 నుంచి నిర్వహించే ప్రజాపాలనలో ఇస్తామంటున్న సర్కారు
- ఇప్పుడున్న వాటిని కొనసాగిస్తారా..? లేదా..?
- ఇంకా తేల్చని మంత్రి వర్గ ఉపసంఘం
- ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన 65వేల పై చిలుకు అర్జీల సంగతేంటి?
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా..? లేక వాటిని పరిగణలోకి తీసుకుంటారా?
- ప్రజావాణికి ఆగని దరఖాస్తుల వెల్లువ
- స్పష్టత లేక ప్రజల్లో అయోమయం

కరీంనగర్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలోని అర్హులందరికీ రేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు ఇస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై గత నెల (ఆగస్టు) 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనేక నిర్ణయాలు తీసుకున్నట్లుగా ప్రభుత్వం వెల్లడించింది. అందుకోసం ఈ నెల 17వ తేదీ నుంచి పది రోజుల పాటు ప్రత్యేకంగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నది. అందులో భాగంగా అర్హులకు రేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు అందించేందుకు అవసరమైన వివరాలు సేకరిస్తామని చెప్పింది. రాష్ట్రంలో ఇకముందు రేషన్ కార్డులకు, ఆరోగ్య కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని పేర్కొంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఈ హెల్త్ కార్డులే ప్రామాణికంగా ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డుల మంజూరు, విధివిధానాలపై చర్చించేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రి వర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ముందుగానే నియమించిన విషయం తెలిసిందే. ఉపసంఘం ఆగస్టు 10న మొదటిసారి భేటీ అయింది. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధానంగా కార్డులకు జారీకి సంబంధించి సక్సేనా కమిటీ సిఫార్సులను పరిగణలోకి తీసుకుంటామని ప్రకటించింది. ఇదే సమయంలో తెల్లరేషన్ కార్డు జారీకి గ్రామీణ ప్రాంతాల్లో ₹1.5 లక్షలోపు వార్షికాదాయం, మాగాణి 3.5 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు, పట్టణ ప్రాంతాల్లో వార్షికాదాయం ₹2 లక్షలోపు ఉండాలనే ప్రతిపాదనలొస్తున్నాయని, అన్నింటిని పరిశీలించి విధివిధానాలు నిర్ణయిస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు మంత్రి వర్గ ఉపసంఘం ఇంకా ప్రభుత్వానికి నివేదిక మాత్రం ఇవ్వలేదన్నది స్పష్టం.

### రేషన్‌కార్డు జారీకి ఏదీ కొలమానం?

ఇప్పటి వరకు ఆహారభద్రత కార్డుతో ఆరోగ్య శ్రీ కూడా లింకు అయి ఉన్నది. ఈ నేపథ్యంలో తెల్లకార్డు తీసుకునేందుకు అందరూ ఆసక్తి చూపుతూ వచ్చారు. నిజానికి చాలా మందికి నెలవారీగా ఇచ్చే బియ్యం అవసరం లేకపోయినా, ఆరోగ్యసేవలను దృష్టిలో పెట్టుకొని తెల్లకార్డు పొందిన కుటుంబాల సంఖ్య పెద్ద మొత్తంలో ఉంటుంది. అయితే ఇప్పుడు ప్రభుత్వం రెండు కార్డులు వేర్వేరుగా ఉంటాయని స్పష్టం చేస్తున్నది. అలాంటప్పుడు ప్రస్తుతం ఉన్న ఆహారభద్రత కార్డులను కొనసాగిస్తారా..? లేక వాటి స్థానంలో తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలంటారా..? అన్నదానిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉన్నది. అందరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి వస్తే ప్రభుత్వానికి కొన్ని లక్షల్లో దరఖాస్తులు వచ్చే అవకాశముంటుంది. అంతేకాదు, లక్షల్లో దరఖాస్తుదారులు రోడ్డుమీదకు వచ్చే ప్రమాదముంటుంది. అలాగే హెల్త్‌కార్డుకు దరఖాస్తు చేసుకుంటే తెల్లకార్డును ఉంచుతారా..? తొలగిస్తారా..? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. కొన్ని నెలలుగా కొత్త రేషన్ కార్డుల కోసం వేలాది మంది వచ్చి కలెక్టరేట్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఇప్పటికే 65,498 మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరు తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా..? లేక ప్రస్తుత దరఖాస్తులను కన్సిడర్ చేస్తారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉన్నది. ఒక ఉన్నతాధికారి మాత్రం కొత్త దరఖాస్తులు ఒక కొత్త ఫార్మెట్‌లో చేసుకోవాల్సి ఉంటుందని, ప్రస్తుతం చేసుకున్న అంటే పాత దరఖాస్తులు ఏవి కూడా పనికి రాకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అంటే కొత్తగా రేషన్ కార్డు కావాలన్నా.. లేదా ఆరోగ్య కార్డు కావాలన్నా కచ్చితంగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరమే ఏర్పడే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 1965 రేషన్ దుకాణాలుండగా, వీటి పరిధిలో 9,80,261 ఆహారభద్రత కార్డులున్నాయి. వీటి పరిధిలో 28,64,897 కుటుంబ సభ్యులున్నారు. మొత్తంగా చూస్తే కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించి అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై అధికారుల వద్ద ఎలాంటి స్పష్టత లేదు. ఈ పరిస్థితుల్లో విధి విధానాలు ఎంత తొందరగా ఇస్తే.. ప్రజల్లో అంత తొందరగా అయోమయ పరిస్థితి తొలిగిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలు, ఆహార భద్రత కార్డులు, కుటుంబాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు**

| జిల్లా | రేషన్ దుకాణాలు | ఆహారభద్రత కార్డులు | కుటుంబాల సంఖ్య | పెడింగ్ దరఖాస్తులు |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 586 | 2,78,592 | 8,11,454 | 16,998 |
| జగిత్యాల | 607 | 3,07,666 | 8,85,567 | 19,100 |
| పెద్దపల్లి | 419 | 2,19,953 | 6,67,314 | 15,900 |
| రాజన్న సిరిసిల్ల | 353 | 1,74,050 | 5,00,562 | 13,500 |

## కమ్యూనిటీ భవనాలను వేగంగా పూర్తి చేయాలి

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 31 : నగరంలో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. శనివారం నగరంలోని 13, 29 డివిజన్లలో చేపడుతున్న వివిధ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. 13 డివిజన్‌లో చేపట్టే ₹10 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో వడ్డెర కమ్యూనిటీ హాల్, హస్నాపూర్ కమ్యూనిటీ హాల్ పనులు, 29వ డివిజన్‌లో ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ₹15 లక్షలతో చేపట్టే కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా కమ్యూనిటీ హాళ్లను నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## షూ వేసుకొని.. రాజన్న ప్రసాదం తీసుకొని

- సోషల్ మీడియాల్లో వైరల్ అవుతున్న సీఎం రేవంత్ రెడ్డి చిత్రం
- అపచారం చేశారంటూ భక్తుల ఆగ్రహం

బూట్లు వేసుకొని ప్రసాదాన్ని అర్చకుల ద్వారా తీసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి

వేములవాడ, ఆగస్టు 31 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు విమర్శలకు తావిస్తున్నది. వేములవాడ రాజన్న ఆలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించినందున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడ రాజన్న ఆలయ అర్చకులు హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయానికి శుక్రవారం వెళ్లి వేదోక్త ఆశీర్వచనం చేసి, రాజన్న శేష వస్త్రం, ప్రసాదం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అంతవరకు బాగానే ఉన్నా సీఎం షూ ధరించి రాజన్న ప్రసాదం తీసుకోవడం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాజన్న ప్రసాదం, ఆశీర్వచనాన్ని అందిస్తున్న సమయంలో ఆయన వ్యవహరించిన తీరును భక్తులు తప్పుపడుతున్నారు. అపచారం చేశారంటూ ఆగ్రహిస్తున్నారు. భక్తి శివుడి మీద ఉందో లేదో తెలియదు కానీ, చిత్తం మాత్రం చెప్పుల మీదే అన్నట్టు ఉందని విమర్శిస్తున్నారు.

## 'మీ సేవ'లో సదరం స్లాట్‌లు

విద్యానగర్, ఆగస్టు 31 : కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో నిర్వహించే సదరం స్లాట్‌లు మీ సేవలో నిరంతరాయంగా అందుబాటులో ఉన్నాయని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ గుండ వీరారెడ్డి తెలిపారు. సెప్టెంబర్‌లో నిర్వహించే సదరం క్యాంపుల వివరాలను వెల్లడించారు. 9న ఆర్థో ,12న మానసిక, 17న కంటి చూపు, 24న వినికిడి, మూగ, చెవుడు క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. మీ సేవలో బుక్ చేసుకున్న వారు సెల్‌ఫోన్లకు వచ్చిన మెసేజ్‌ల ఆధారంగా క్యాంపులకు హాజరు కావాలని సూచించారు. రెన్యువల్ క్యాంపులకు హాజరయ్యేవారు నేటి నుంచి మీ సేవకు వెళ్లి బుక్ చేసుకోవచ్చని సూచించారు. సదరం ఐడి కలిగి ఉన్నవారు నేటి నుంచి మీ సేవలో స్లాట్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. క్యాంపులకు హాజరయ్యేవారు మెడికల్ రిపోర్టులు మీ సేవలో బుక్ చేసుకున్న రసీదుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని నిర్ణయించిన తేదీల్లో క్యాంపులకు హాజరు కావాలని సూచించారు.

## సీపీఎస్ రగడ

- పాత పెన్షన్ కోసం ఉద్యోగుల ఉద్యమ బాట • ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులతో జేఏసీ ఏర్పాటు • నేడు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు సన్నాహాలు

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 31 : ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య కొద్ది నెలలుగా కొనసాగుతున్న పెన్షన్ రగడ తీవ్రస్థాయికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామంటూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, సీపీఎస్ ఉద్యోగులపై ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇచ్చిన హామీల అమలుపై ఎలాంటి స్పందన లేకపోగా, ఉద్యోగ సంఘాల నాయకులపై అభాండాలు వేస్తుండడంతో దీర్ఘకాలిక పోరాటం కరీంనగర్ జిల్లా నుంచే షురూ చేయబోతున్నారు. ఉద్యోగుల పాలిట శరాఘాతంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ఎత్తివేతపై ఉద్యోగ సంఘాలు అనేకసార్లు ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోకపోవడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉద్యోగ సంఘాల నాయకులు దీర్ఘకాలిక ఉద్యమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. 2004 సెప్టెంబర్ 1న మొదలైన సీపీఎస్‌ను రద్దు చేసేదాకా తమ పోరాటం ఆగదంటూ తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులతో జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఏర్పాటు చేసుకోగా, పాత పెన్షన్ రద్దైన సెప్టెంబర్ 1 నుంచి వరుస ఆందోళనలు చేపట్టేందుకు జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్ల జేఏసీ సిద్ధమవుతున్నది. పాత పెన్షన్ తిరిగి సాధించుకునేందుకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసనలు, దీక్షలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉద్యోగులు విద్రోహ దినంగా భావించే నేడు తమ సత్తా చాటేందుకు సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా ఉన్న 9 వేల మంది ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆదివారం భారీ ఎత్తున ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టరేట్ రోడ్డులో నిర్వహించనున్న ఈ ఆందోళన కార్యక్రమం రాష్ట్రస్థాయిలో కనీవినీ ఎరుగని రీతిలో చేపట్టనున్నట్లు జాక్టో ప్రతినిధులు పేర్కొంటున్నారు. పెన్షన్ ఉద్యోగికి భిక్ష కాదని, అది ఉద్యోగుల హక్కు అని ప్రతి ఉద్యోగి, విశ్రాంత ఉద్యోగి భావిస్తూ ధర్నాకు తరలిరావాలని జేఏసీ నాయకులు పిలుపునివ్వడంతో కార్యక్రమంలో పాల్గొనేందుకు సంఘాలకతీతంగా ఉద్యోగులు తరలివచ్చేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం.

# సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తాం

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

- బీ థర్మల్ స్థానంలోనే 800 మెగావాట్ల ప్రాజెక్టు
- సింగరేణి, జెన్‌కో సంయుక్తంగా రూ.8 వేల కోట్లతో ఏర్పాటు
- భూసేకరణ పూర్తి చేసి అంచనాలను రూపొందించాలి
- టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

పెద్దపల్లి, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): రామగుండం బీ థర్మల్ ప్రాజెక్టు స్థానంలోనే సింగరేణి, జెన్‌కో సంయుక్తంగా ₹8 వేల కోట్లతో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ పవర్ విద్యుత్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రామగుండంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన బీ థర్మల్ పవర్ ప్రాజెక్టును రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి, జెన్‌కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం గోదావరిఖని చౌరస్తాలోని సెక్టార్ 2వద్ద ₹3 కోట్లతో నిర్మించిన నైపుణ్య కేంద్రం, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమృత్ 2.0 టీయూఎఫ్‌డీఎసీ కింద చేపట్టే పలు అభివృద్ధి పనులు, సింగరేణి ఆధ్వర్యంలో ₹5 కోట్లతో 23 కిలోమీటర్ల అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రామగుండంలో 800 మెగా వాట్ల పవర్ ప్లాంట్ నిర్మిస్తామని ప్రకటించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించి తొందరగా ప్రతిపాదనలు పంపితే అంతే తొందరగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి శుక్రవారం సీఎంతో చర్చించి ఆమోదింపజేసుకొని సూత్ర ప్రకటనకు నిర్ణయించామన్నారు. 1971లో ఏర్పాటుచేసిన రామగుండం ఆర్‌టీఎస్ బీ బ్లాక్ 50 ఏళ్లపాటు సేవలు అందించిందని, సాంకేతిక కారణాలతో దానిని మూసి వేయాల్సి వచ్చిందని, దీనితో స్థానిక ప్రజలకు ఉన్న భావోద్వేగాలను గుర్తించి ఇక్కడే పవర్ ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించామన్నారు. సింగరేణి కార్మికులకు ₹కోటి, కాంట్రాక్ట్ కార్మికులకు ₹30 లక్షల బీమా కల్పించామన్నారు. రాష్ట్రంలో 2031 నాటికి గరిష్ఠంగా 27, 059 మెగావాట్లు, 2034-35 నాటికి 31, 809 మెగావాట్ల పైగా విద్యుత్ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, థర్మల్, సోలార్, హైడల్, పంప్ స్టోరేజ్, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు చేస్తామని, విద్యుత్ సర్‌ప్లస్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ కింద రాష్ట్రంలో మరో నాలుగు వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ఇందులో మహిళా సంఘాలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరిక మేరకు పాలకుర్తి ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తామని, సింగరేణి కాంట్రాక్ట్ ఉద్యోగస్తుల అంశాన్ని పరిశీలించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని, అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్, సబ్ స్టేషన్, విద్యుత్ పోల్స్ మంజూరు చేస్తామని, ఆర్‌అండ్ ఆర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### యువతకు ఉపాధి : మంత్రి శ్రీధర్‌బాబు

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఒక నెల రోజుల లోపు 100 మందికి ఉపాధి కల్పించే రూరల్ టెక్నాలజీ సెంటర్ అనే సాఫ్ట్ వేర్ సంస్థను రామగుండంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సుల్తానాబాద్ వద్ద కూడా రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు పడికరాల స్థలం గుర్తించామని, సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు గోదావరిఖని పట్టణంలోని సింగరేణి ఖాళీ స్థలాన్ని సేకరించి మొదటి సంవత్సరం 3500 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి అందిస్తామని, దీనిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో సింగరేణి ప్రాంతంలో 20 వేల మంది కార్మికులకు పట్టాలు పంపిణీ చేశామని, మరో నాలుగైదు వేల మంది భూములు రెగ్యులరైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### రామగుండం అభివృద్ధికి కృషి : మంత్రి పొన్నం

రామగుండం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర ప్రత్యేకమైందన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరిన విధంగా ఈ ప్రాంతానికి త్వరలోనే అదనంగా బస్సులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 211 మహిళా సంఘాలకు ₹23 కోట్ల 35 లక్షల 50 వేల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను డిప్యూటీ సీఎం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్‌మక్కాన్ సింగ్, చింతకుంట విజయరమణారావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు, రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, ఆర్డీవోలు బీ గంగయ్య, వీ హనుమానాయక్ పాల్గొన్నారు.

## కరీంనగర్‌కు రెడ్ అలర్ట్

- రాబోయే రెండు రోజులపాటు అతి భారీ వర్షసూచన • రంగంలోకి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు • అందుబాటులోకి ప్రత్యేక నంబర్లు

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 31 : రాబోయే 48 గంటల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడొచ్చని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాల వారీగా కలెక్టర్లు రంగంలోకి దిగారు. శనివారం కలెక్టరేట్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక నంబర్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు కూడా అలర్ట్‌గా ఉండాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా సమాచారం అందించాలని కోరారు. ఇటు అధికారులను అప్రమత్తం చేస్తూ ప్రకటనలు ఇచ్చారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ఎక్కడ వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడినా వెంటనే సమాచారం అందించేలా సిబ్బందిని సమాయత్తం చేయాలని నిర్దేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. కరీంనగర్‌కు రెడ్ అలర్ట్ జారీ చేయగా, కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, వాగులు, కుంటల్లోకి వచ్చే వరదను నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడ కూడా గండ్లు పడకుండా పర్యవేక్షించాలన్నారు. లో లెవల్ వంతెనలు, కాజ్‌వేల వద్ద బస్సులు జాగ్రత్తగా నడిపేలా ఆర్టీసీ డ్రైవర్లను అప్రమత్తం చేయాలని సూచించారు. అవసరమైతే వరద ప్రవాహం ఉండే ప్రాంతాల మీదుగా వాహనాల రాకపోకలను నిషేధించాలని, ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలన్నారు.

**కరీంనగర్ కంట్రోల్ రూం నంబర్లు** 91878 2997247, 8125184683

**జగిత్యాల :** 1800 425 7620

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571